క్లుప్తంగా

డ్రంకెన్ డ్రైవ్ కేసుల నమోదు



ధరూరు: వాహన తనిఖీల్లో భాగంగా సోమవారం ధరూరు రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో నిర్వహించిన తనిఖీల్లో డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీహరి తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడప రాదని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

అయిజ: మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించనున్న ప్రజా వేదిక కార్యక్రమానికి సంబంధిత అధికారులు, సిబ్బంది రికార్డులతో హాజరు కావాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవని ఎంపీడీఓ వెంకటయ్య సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా నిర్వహించిన 14వ విడత సామాజిక తనిఖీల్లో భాగంగా సామాజిక తనిఖీ బృందం క్షేత్ర స్థాయిలో తనిఖీలు నిర్వహించి నివేదిక రూపొందించినట్లు తెలిపారు. నివేదికపై ప్రజా వేదికను ఈనెల 4న మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ పేర్కొన్నారు.

ప్రతి విద్యార్థి రోల్‌మోడల్‌గా ఎదగాలి



ఎర్రవల్లి: ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల కష్టాన్ని గౌరవించి క్రమశిక్షణతో చదివి రోల్ మోడల్‌గా ఎదగాలని ఎంపీడీఓ అజార్ మొహియుద్దీన్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని ధర్మవరం బీసీ బాలుర, వల్లూరు ఎస్సీ బాలుర వసతి గృహాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వసతి గృహాల్లోని వసతులను, వంట గదులను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగించుకొని ముందుకు సాగాలని సూచించారు. విద్యతో పాటు ఆరోగ్యం ముఖ్యమని ప్రతి రోజు వ్యాయామం చేయాలన్నారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా వసతి గృహాల వార్డెన్‌లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

ఎర్రవల్లి: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల నియామకానికి ఆర్థిక సాయం



అయిజ: మండలంలోని ఈడుగోనిపల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యా వలంటీర్ల నియామకానికి గ్రామానికి చెందిన బడేసాబ్ యాదవ్ ఆర్థిక సహాయం చేశారు. సోమవారం ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణకు రూ.15 వేల నగదు అందజేశారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని విద్యా వలంటీర్లను ఏర్పాటు చేసేందుకు ఆర్థిక సహాయం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా బడేసాబ్ యాదవ్‌ను ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పందుల దొంగతనం.. కేసు నమోదు

ఉండవెల్లి: మండల కేంద్రంలోని సుధాకర్ అనే వ్యక్తి ఇంటి ఆవరణలో పెంచుతున్న 50 పందుల్లో 10 పందులను అపహరించినట్లు బాధితుడు తెలిపారు. గతనెల 5న అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు 10 పందులను ఎత్తుకెళ్లారని, చుట్టు పక్కల వెతికినా లభించకపోవడంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు.

కాల్వ పనులు పూర్తయ్యేదెన్నడో..?

- డీజిల్ ఇంజన్లతో నీటి తడులు
- తడిసి మోపడవుతున్న పెట్టుబడులు

అయిజ: నెట్టెంపాడు ప్రాజెక్ట్ ద్వారా రిజర్వాయర్ నుంచి నడిగడ్డలోని పంట పొలాలకు సాగునీరందించేందుకు ఏర్పాటు చేసిన కాలువ పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. 19 ఏళ్లు గడుస్తున్నా ముచ్చోనిపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కాలువ పనులు పూర్తికాకపోవడంతో ఆయకట్టు పంట భూములకు రిజర్వాయర్ నీరు పూర్తిగా చేరడం లేదు. ఈ నేపథ్యంలో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. పంట పెట్టుబడి తడిసి మోపడవుతుందని వాపోతున్నారు.

కలగానే నెట్టెంపాడు సాగునీరు..

ముచ్చోనిపల్లి రిజర్వాయర్ నుంచి అయిజ మండలంలోని వివిధ గ్రామాల శివార్లలోని పంట పొలాలకు కాలువల ద్వారా సాగునీరందించాల్సి ఉండగా ప్రస్తుతం వేల ఎకరాలకు సాగునీరు అందడం లేదు. ఆయకట్టు రైతులకు నెట్టెంపాడు సాగునీరు కలగానే మిగిలింది. నీటితడులు లేని పంటలు దిగుబడి రాకపోవడంతో అన్నదాతలు అప్పుల ఊబిలో కూరుకపోయారు. వందల అడుగుల లోతుల్లో బోరుబావులు తవ్వినా నీళ్లు రాకపోవడంతో ఆస్తులు అమ్ముకుంటున్నట్లు అన్నదాతలు వాపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కాలువ పనులు త్వరగా పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు.

2006లో పనులు ప్రారంభం..

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కృషితో నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్, కల్వకుర్తి ఎత్తిపోతల పథకాల పనులు 2006 సంవత్సరంలో ప్రారంభమయ్యాయి. నెట్టెంపాడు ప్రాజెక్ట్ పనుల్లో భాగంగా 109 ప్యాకేజీ కింద జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు మండలంలోని ముచ్చోనిపల్లి గ్రామ శివారులో రూ. 38.25 కోట్లు ఖర్చు చేసి 1.634 సామర్థ్యం గల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మించారు. దాని వలన సుమారు 2,500 ఎకరాలు నీటి



బి.తిమ్మాపూర్ శివారులో అసంపూర్తిగా ఉన్న కాల్వ

ముంపునకు గురయ్యింది. బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో 16,000 ఎకరాలకు సరిపడా నీటిని నిల్వ చేస్తారు. అయితే 107 ప్యాకేజీ ద్వారా ర్యాలంపాడు దగ్గర ఏర్పాటు చేసిన ఎత్తిపోతల నుంచి మెయిన్ కెనాల్ ద్వారా 38 వేల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంది. అనుకోని పరిస్థితుల్లో మెయిన్ కెనాల్ నుంచి పంట పొలాలకు సాగునీరందని సందర్భంగా పంటలు ఎండిపోకుండా ఉండేందుకు అధికారులు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ద్వారా సాగునీటిని కాలువలకు విడుదల చేసేందుకు ఏర్పాటు చేశారు.

12,740 ఎకరాలకు అందని సాగునీరు

ముచ్చోనిపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో భాగంగా 107 ప్యాకేజీ ద్వారా మొత్తం 38 వేల ఎకరాలకు సాగునీరందించాల్సి ఉండగా ఇప్పటి వరకు కేవలం 25,260 ఎకరాలకు మాత్రమే సాగునీటిని అందిస్తున్నారు. ఇంకా 12,740 ఎకరాలకు సాగునీరు సరఫరా కావడం లేదు. ఫీటు కాలువ పనులు ఇప్పటి వరకు పూర్తి కాలేదు. పనులు నత్తనడకన సాగుతుండడంతో రైతులు ఆవేదనకు గురవుతున్నారు. కొన్ని



ఎక్లాస్‌పురం శివారులో ఆయిల్ ఇంజన్‌తో నీళ్లు తోడుతున్న దృశ్యం(ఫైల్)

ప్రదేశాల్లో కాల్వ పనులు పూర్తయినా సరే కొంత మంది రైతులకు ఇంత వరకు నష్టపరిహారం అందలేదు. దీంతో అక్కడక్కడ ప్రధాన కాలువ పనులు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో కాలువలు తవ్వినా సరే బి.తిమ్మాపూర్ శివారులో సాగునీటి సరఫరా లేకుండా పోయింది. రైతులు డీజిల్ ఇంజన్లను ఏర్పాటు చేసుకొని పంట పొలాలకు సాగునీటిని అందిస్తున్నారు. దీంతో పెట్టుబడి తడిసి మోపవడువుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏళ్లతరబడి ఎదురుచూస్తున్నాం..



నెట్టెంపాడు ప్రాజెక్ట్ నుంచి పంట పొలాలకు సాగునీరు వస్తుందని ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నాం. పంట పొలాల్లో యంత్రాలతో కాలవులు తవ్వి అసంపూర్ణంగా వదిలేశారు. ముచ్చోనిపల్లి రిజర్వాయర్‌లో నీళ్లున్నా లాభం లేకుండా పోయింది. కాలువలు తవ్వకుండా ఉన్నా సరే ఆ స్థలంలో పంటలు పండించుకునేవాళ్లం.

– వెంకటేశ్వర్ రెడ్డి, రైతు, ఎక్లాస్‌పురం

సాగునీరు అందించాలి..



కాలువలకు దూరంగా పంట భూములున్నవారి పరిస్థితి మరీ దీనంగా ఉంది. వచ్చే ఏడాది వర్షాకాలం నాటికైనా కాలువ పనులు పూర్తిచేసి పంటలకు సాగునీటిని విడుదల చేయాలి. అధికారులు దీనిపై చర్యలు తీసుకోవాలి.

– లింగన్న, రైతు, బి.తిమ్మాపూర్ శివారు

భూసేకరణ పూర్తి కాలేదు..

కాలువ నిర్మాణం కోసం చేపట్టిన భూసేకరణ పూర్తి కాలేదు. దీంతో కాలువ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. భూసేకరణ సమస్యలు పరిష్కారమైన అనంతరం కాలువ పనులు పూర్తి చేస్తాం.

– శిరీష, డిప్యూటీ ఈఈ

దిగజారుడుతనానికి నిదర్శనం

గద్వాల: సీఎం రేవంత్‌రెడ్డి వనపర్తిలో మాట్లాడే భాష దిగజారుడు తనానికి నిదర్శమని బీఆర్ఎస్ నాయకులు కుర్వ విజయ్‌కుమార్, కుర్వ పల్లయ్య విమర్శించారు. సోమవారం గద్వాలలో వేర్వేరుగా నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. వనపర్తి సభలో సీఎం రేవంత్‌రెడ్డి మాజీ సీఎం కేసీఆర్‌పై వాడిన భాష సభ్య సమాజం హర్షించలేనిదిగా ఉందని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కేసీఆర్‌ను తిట్టడమే పనిగా పెట్టుకున్న ఆయన పాలనను పూర్తిగా విస్మరించారన్నారు. అదే విధంగా యాసంగి సీజన్‌కు సంబంధించి రైతులకు రైతు భరోసా ఇవ్వలేదని ధ్వజమెత్తారు. ఎకరానికి రూ.15వేలు ఇస్తానని చెప్పి రూ.12వేలకు కుదించారు. ఆ డబ్బులు సైతం నేటికి రైతులకు అందలేదన్నారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా 400 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాల ఊసే లేకుండా పోయిందన్నారు. పదేపదే పాలమూరు బిడ్డ అని చెప్పుకునే సీఎం పాలమూరుకు ఎలాంటి ప్రయోజనం చేకూర్చలేదన్నారు. గోపాల్, కేశన్న, వీరేష్ పాల్గొన్నారు.

ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలి

అయిజ: బ్యాంక్ ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలని యూనియన్ బ్యాంక్ మేనేజర్ రాజేంద్రప్రసాద్ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్‌లో మేనేజర్ రాజేంద్రప్రసాద్ రెడ్డి, కానిస్టేబుల్ రవి ఖాతాదారులకు దొంగతనాలపై అవగాహన కల్పించారు. బ్యాంకుల నుంచి వినియోగదారులు నగదు, బంగారు ఆభరణాలు తీసుకెళ్తుంటారని, దొంగల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని పలు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికితీయాలి



మాట్లాడుతున్న హెచ్‌ఎం రాజన్న

గట్టు: విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను ఉపాధ్యాయులు వెలికి తీయాలని ఎంఈఓ నల్లారెడ్డి కోరారు. సోమవారం తుమ్మలచెరువు ప్రాథమికోన్నత పాఠశాలలో సమగ్ర శిక్ష అభియాన్, ఎంవీఎఫ్ ఆధ్వర్యంలో సబ్జెక్టు మేళా నిర్వహించారు. హెచ్‌ఎం రాజన్న ఆధ్వర్యంలో తెలుగు, గణితం, సామాన్య శాస్త్రం, ఇంగ్లిష్ సబ్జెక్టుల వారీగా వివిధ రకాలైన టీఎల్ఎం మెటీరియల్‌ను ప్రదర్శించి, వాటి గురించి వివరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ నల్లారెడ్డి మాట్లాడుతూ.. తరగతి గదుల్లో విద్యార్థులకు ఏం నేర్పిస్తే అదే గుర్తుకు పెట్టుకుంటారన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం నాగరాజు, ఆలూరు హెచ్‌ఎం రామన్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి గోపాల్, సీఆర్‌పీఎఫ్ కన్వీనర్ హనుమంతు, విద్యార్థులు తల్లిదండ్రులు, ఎంవీఎఫ్ గట్టు, కేటిదొడ్డి ఇన్‌చార్జి వీరేష్‌సాగర్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

డీసీఈబీ సెక్రటరీ ప్రతాప్‌రెడ్డి



ఉప్పేరు ఉన్నత పాఠశాలలో పరీక్షలు పరిశీలిస్తున్న డీసీఈబీ సెక్రటరీ ప్రతాప్‌రెడ్డి

ధరూరు: పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డీసీఈబీ సెక్రటరీ ప్రతాప్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఉప్పేరు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నిర్వహిస్తున్న పరీక్షలను పరిశీలించారు. అనంతరం మండల పరిధిలోని చిన్నపాడు, సోంపురం తదితర పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులు తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనంపై ఆరా తీశారు. ప్రతి ఒక్కరికి అపార్ ఐడీని నమోదు చేయాలన్నారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. హాజరు శాతాన్ని పెంచాలని, వారానికి మూడు గుడ్లు, మూడుసార్లు రాగి జావ అందించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీల్లో ఉపాధి పనులు కల్పించండి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అలంపూర్: మున్సిపాలిటీల్లో కూలీలకు ఉపాధి హామీ పనులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రేపల్లె దేవదాసు, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు కోరారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలో పూర్తి స్థాయిలో ఉపాధి హామీ పనులు కల్పించాలని ఎంపీడీఓ పద్మావతికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఉపాధి హామీ కూలీలకు రూ. 86 వేల కోట్లు కేటాయించడం దారుణమని విమర్శించారు. రూ. రెండున్నర లక్షల కోట్లు కేటాయించాలన్నారు. గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలకు అవగాహన కల్పించి పూర్తిస్థాయిలో ఉపాధి పనులు జరిగే విధంగా అధికారులు చొరవ చూపాలన్నారు. గ్రామ సభల్లో తీర్మానం చేసిన రైతుల పొలాల్లో ఉపాధి పనులు చేపట్టాలన్నారు. ఉపాధి కూలీలకు పనిముట్లు గడ్డపార, తట్ట, బిందె, డ్రమ్ము, మెడికల్ కిట్టు అందజేయాలన్నారు. ప్రతి ఉపాధి కూలీకి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ద్వార ఏడాదికి రూ. 12 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రోజువారి కూలీ రూ.600 చొప్పున వచ్చే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు జయన్న తదితరులు పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాల పరిశీలన



ధరూరు : పాఠశాలల్లో మౌలిక వసతులతో పాటు విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మండల విద్యాధికారి రవీంద్రబాబు పరిశీలించారు. సోమవారం మండల పరిధిలోని దోర్నాల, గుర్రోనిపల్లి, బూరెడ్డిపల్లి గ్రామాల్లోని పాఠశాలలను సందర్శించారు. అపార్ ఐడీల నమోదు పకడ్బందీగా చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ప్రయోగాల ప్రదర్శన



అలంపూర్ రూరల్: పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో సోమవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సైన్స్ ప్రయోగాలను ప్రదర్శించారు. చంద్రయాన్, ఎల్‌పీజీ గ్యాస్, జియో శాటిలైట్, సమతుల ఆహారం, నీటిని శుద్ధి చేయడం తదితర అంశాలపై విద్యార్థులు వివరించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జఫరుల్లా, సైన్స్ ఉపాధ్యాయులు నరసింహులు, శోభారాణి, ఆనీస్ అహ్మద్, రషీద్, ఉపాధ్యయ బృందం, పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యంతో ఎదగాలి



మాట్లాడుతున్న హృదయరాజు

మల్దకల్: ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యంతో జీవితంలో ఎదగాలని జిల్లా ఇంటర్మీడియేట్ అధికారి హృదయరాజు విద్యార్థులకు సూచించారు. సోమవారం మల్దకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థి జీవితంలో ఇంటర్మీడియేట్ విద్య ఎంతో కీలకమన్నారు. ప్రతి విద్యార్థి ఇంటర్‌లోనే తమ లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదవాలన్నారు. విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల చదువుపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణ, అధ్యాపకులు నర్సింహులు, రామాంజనేయులు గౌడ్, గోవర్ధన్ శెట్టి, భాగ్యలక్ష్మి, తిమ్మోతి పాల్గొన్నారు.

'సంపత్‌కుమార్‌కు ఎమ్మెల్సీ ఇవ్వాలి'



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

అలంపూర్: ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్‌కు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు దేవరపోగు నరసింహ్మ కోరారు. పట్టణంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్‌కు ఎస్సీ సామాజిక వర్గం కోటా నుంచి ఎమ్మెల్సీ ఇవ్వాలన్నారు. కాంగ్రెస్ పార్టీలో 30 ఏళ్లుగా క్రమశిక్షణతో పని చేస్తున్నారన్నారు. పార్టీ బలోపేతం కోసం తనదైన శైలిలో నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. బడుగు బలహీన వర్గాల వ్యక్తిగా దృష్టిలో ఉంచుకొని ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు కె.ఎల్లన్న, రాముడు, విక్రం, రామకృష్ణ, బుచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



జాంపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులుగా విద్యార్థులు

గద్వాలటౌన్: మండలంలోని అనంతపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు చక్కటి బోధన చేశారు. ఉత్తమ బోధన చేసిన విద్యార్థులకు హెచ్‌ఎం అమృతమ్మ బహుమతులు అందజేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు ఆడి, పాడి సందడి చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాలమణి, ప్రశాంతి, లక్ష్మయ్యశెట్టి, గోపాల్, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ధరూరు: మండల పరిధిలోని జాంపల్లి ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాన దినోత్సవం విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. విద్యారులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని హెచ్‌ఎం రేవతి ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సమస్యలపై నిరంతర పోరాటం



పొంరెడ్డిపల్లిలో మురుగుకాల్వ దుస్థితిని చూపిస్తున్న సీపీఎం నాయకులు

అమరచింత: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలంటూ సీపీఎం ఆధ్వర్యంలో నిరంతరం పోరాటం చేస్తున్నామని సీపీఎం మండల నాయకులు వెంకటేష్, అజయ్ అన్నారు. పార్టీ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు గ్రామ సమస్యలపై పార్టీ పరంగా సర్వే చేపడుతున్నామన్నారు. మార్చి చివరి నాటికి సమస్యలపై సర్వే నిర్వస్తామని తెలిపారు. మండలంలోని పొంరెడ్డిపల్లిలో సోమవారం కాలనీల్లో తిరుగుతూ సమస్యలు గుర్తించారు. గ్రామంలో స్కూల్ గ్రౌండ్‌లో ఉన్న వాటర్ ట్యాంక్ శిథిలావస్థకు చేరుకుందని నూతన వాటర్ ట్యాంకు నిర్మించాలని కోరారు. సీసీ రహదారుల సమస్య వేధిస్తున్నా అధికారులు, గత పాలకులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. గ్రామంలో డ్రైయినేజీల నిర్మాణం లేకపోవడంతో మురుగు రహదారులపై పారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ స్థలాలు ప్రైవేట్ వ్యక్తులు కబ్జా చేస్తున్నారని, అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆసరా పెన్షన్ల కోసం వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు సమీపంలోని అమరచింతకు వెళ్లాల్సిన పరిస్థితి కల్పించడం ఏమిటని ప్రశ్నించారు. గ్రామ సమస్యలను పరిష్కరించాలంటూ ఈనెల 6న పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శంకర్, మహేష్, మోహన్, అంజిరెడ్డి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

హరహర మహాదేవ.. శంభో శంకర



స్వామివారి పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు



కోలాటం ఆడుతున్న కళాకారులు



స్వామివారికి దాసంగాలు పెడుతున్న భక్తులు

ఆత్మకూర్: పట్టణ శివారులోని చెరువు మధ్యలో వెలసిన స్వయంభూ పరమేశ్వరస్వామి జాతరలో భాగంగా సోమవారం రాత్రి మూడో రోజు భక్తిశ్రద్ధలతో పల్లకీసేవ, పూజలు, రథోత్సవం నిర్వహించారు. ఉదయం స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించి ఉత్సవమూర్తి విగ్రహాలను ఆలయంలోని శివలింగంపై అలంకరించారు. వందలాది మంది భక్తులు బక్షాలు, పచ్చిపులుసు, అన్నంతో దాసంగాలు పెట్టి స్వామివారికి నైవేద్యంగా సమర్పించారు. అనంతరం ప్రముఖ పూజారి కర్పసయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. జాతర కమిటీ కన్వీనర్ వెంకటనర్సింహారావు, నిర్వాహకులు సాయిరాఘవ, మణివర్ధన్‌రెడ్డి, యాదగిరిశెట్టి, తెలుగు నగేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పిన్నంచర్ల గ్రామస్తుల భజన, పల్లెకోళ్ల కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

భక్తిశ్రద్ధలతో పల్లకీసేవ..

సోమవారం రాత్రి వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి మొదలుకొని పట్టణంలోని పుర వీధుల గుండా మేళతాళాలతో స్వామివారికి పల్లకీసేవ నిర్వహించారు. రథోత్సవంపై పరమేశ్వరస్వామి విగ్రహాలు ఉంచి రథోత్సవం చేశారు. జిల్లా నలు మూలల నుంచి భక్తులు వేలాదిగా పాల్గొన్నారు. జాతర మైదానంలో వివిధ పాఠశాలల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి, ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రహ్మతుల్లా, రవికాంత్, నాగేష్, పరమేష్, తులసీరాజ్, శ్రీను, దామోదర్, మహేష్ తదితరులు ఉన్నారు.